పోరాటానికి ఎందుకు రాలేకపోయారు? అదీ చదరంగపుఎత్తే - గనుక ప్రపంచాన్ని అగ్రరాజ్యాలు వాటాలు వేసుకొని పంచుకోడానికి యుద్ధాలు అవసరం. ఆమాటకొస్తే అహింసాయుతంగా పోరాడమన్నది కూడా హింసాయుతంగా పోరాటాన్ని కొనసాగించలేక వేసిన గమ్మత్తయిన ఎత్తేకాని అది సర్వరోగ నివారిణికాదు.

ఇంతకీ మీరు చదరంగం ఆడండి. మీకు రాజకీయాలు ఎంత సులువుగా బోధపడతాయో మీ బుద్ధి ఎంత వికసిస్తుందో దానంతటదే మీకు తెలుస్తుంది. వుండండి - మా వారు గుర్రాన్ని తీస్తున్నారు. అది ఏనుగుమీదా, మంత్రిమీదా, రాజుమీదా పడేట్లుంది....

# మోడ్రన్ దమయంతుల శృంగార నైషధం

శతకోటి సీలింగులకు అనంతకోటి ఉపాయాలన్నారు పెద్దలు. లోపాయకారీగా మనంతట మనవే ఎన్నో సీలింగులను ఐచ్ఛికంగా పెట్టుకుంటున్నాము. ఇన్ని అంట్లయితే నేను తోవలేనండమ్మగారూ అంటుంది పనిమనిషి. ఇంతగా మాపితే మేం ఉతకలేమండీ అంటుంది రజక స్త్రీ (రజకుడ్ని రజకశ్రీ అనాలి కవిశ్రీలాగ) రోడ్ల పేరుల్ని మార్చగలంగాని రోడ్డు స్వభావాన్ని అంటే గుంటల్నీ గోతుల్నీ మార్చగలవా - అల్లాగే సీలింగుల్ని పెట్టగలంకాని ప్రజల స్వభావాన్ని మార్చగలవా? మార్చలేం - మార్చలేం. ఇప్పుడు గో సంరక్షణ చేసేవాళ్ళూ, తిక్కశంకరాచార్లూ ఒక్క మాటనరేవి? ఎందుకంటారా? హిందూమత సంప్రదాయం ప్రకారం మన ప్రాచీన ఆర్షవైదిక వివాహ సంస్కృతి ననుసరించి "నాతిచరామి" అని ఏవేవో వల్లించిన సంపన్న కుటుంబాల్లోని ఆంధ్ర నారీమణులు మతం మార్చుకుని వెధవ ఆస్తికోసం తాళికట్టిన భర్తల్నుంచి విడాకులు పొందటంకోసం కోర్టుల చుట్టూ రిజిస్ట్రారాఫీసుల చుట్టూ తిరగనేల?

మన కల్చర్ మన భాష మన ఆచారాలు సంప్రదాయాలకు ప్రతి నిధులు పూజ్యులు అనుకుంటున్న మన స్త్రీలు అన్ని విలవలకూ నీతి నియమాలకూ ధర్మసూత్రాలకూ "టాటా" చెప్పి విడాకులకోసం ఎగబడుతున్నారట - వెధవ ఆస్తికోసం.

వెధవ ఆస్తి అని ఎందుకన్నానంటే ఒక పిక్చర్ తీస్తే పోతుంది. ఒక ముచ్చటైన మూడు రంగుల సచిత్ర మాసపత్రిక పెడితే పోతుంది. పేకాడితే పోతుంది. దక్షిణ నాయకుడ్నని పించుకోవడం కోసం పదిమంది స్నేహితురాళ్ళ కోసం ఖర్చుపెడితే పోతుంది. తెలియకుండా ఏదైనా వ్యాపారం పెడితే పోతుంది. ఆస్తి అనేది హారతి కర్పూరం లాంటిది.

అటువంటి ఆస్తికోసం అగ్నిసాక్షిగా పెండ్లియాడిన ఇల్లాలికి మతం యిప్పించి మరో మరో కారణం జూపించి విడిపోయినట్లు "విడాకులు" పుచ్చుకోనేల? మరి మన్ది ధర్మంకోసం పడిచచ్చిపోయే జాతి అనుకుంటావే? కాదా?

రాజుతో తగూపడటం మంచిదా, దైవంతో విరోధించటం మంచిదా అంటే వెనకటికో జిజ్ఞాసువు రాజుతో దెబ్బలాడకు (పీక తీసే గల్లు), దేవునితో విరోధం ఫరవాలేదు అన్నాడ్ట. అలా వుంది మన వారి వ్యవహారం.

ఈ భూకమతాల గరిష్ఠ పరిమితి శాసనం వలన మనకు ఒకే ఒక లాభం వచ్చింది. మన సోకాల్డు వైవాహిక దాంపత్యాలు ఎంత గట్టివో తెలిసొచ్చింది. ఆస్తికోసం డైవోర్సులు దాకా వెళ్ళిపోయిన వీళ్ళని బీదవారికి సంరక్షకులుగా నియమించారండి ధర్మకర్తృత్వ సిద్ధాంత ప్రదాత జాతిపితగారు. సత్యహరిశ్చంద్రుడు ఏ వూర్లో పుట్టాడో నాకైతే తెలీదు గాని, ఆ మహారాజు ఏలూర్లోనో, గుడివాడలోనో, భీమారం, నరసాపురాల్లోగాని పుట్టి వుంటే విశ్వామిత్రుడు కోరిన కోరికలకు లేదా బాకీ తీర్చమన్నందుకు చంద్రమతికి మతం మార్పించి విడాకు లిప్పించేసి వుండును. పాపము శమించుగాక.

క్యారెక్టర్ లేని జాతి త్వరగా నాశనమవుతుందని ఎక్కడో చదివిన గుర్తు. మనకు నేషనల్ పిట్ట, నేషనల్ గీతం, నేషనల్ మ్యూజియం, నేషనల్ ఎంబ్లెం వున్నాయి కాని నేషనల్ క్యారెక్టర్ అనేది లేదు. క్యారెక్టర్ లేని జాతికి కాండక్టు ఎలా వుంటుందో వూహించుకోండి.

భారతీయ స్త్రీ త్యాగానికీ, పాతివ్రత్యానికీ, సేవా ధర్మానికి మేటి అని డప్పులు వాయించే వారంతా ఈ ఆస్తికోసం విడాకుల తాపత్రయాన్ని ఏ రకం త్యాగం క్రింద ఏ రకం పాతివ్రత్యం క్రింద జమకడ్తారో చూడాలి.

ఇదేవిటీ విడాకులకై విరగబాటు అని నేను మా వారిని అడిగా. హిందూ రిలిజన్ కల్చర్, ట్రెడిషన్ మరి వీటి ప్రభావం మన ఇస్త్రీ మణులమీద తీవ్రంగా పనిచేస్తుందంటారే – మరీ మతం మార్పిడి దుస్తుల మార్పిడిలా జరిగిపోతున్నదేమి? ఇలాగే భర్తల మార్పిడి కూడా వస్తుందా మన ఆర్షహిందూ సొసైటీలో అని భయాందోళనల్తో ప్రశ్నించా.

అబ్బే–యివి వుత్తుత్త విడాకులే – టెక్నికల్‌గా విడాకులు, లోపాయ కారీగా సంసారాలు సాగిస్తూనే వుంటారు. దీనివల్ల పాతివ్రత్యం చెడదు. ఈ విడాకులకై ఎగబడటం కూడా ఒక రకమైన ఫామిలీ ప్లానింగు – గవర్మెంటు ఇండైరక్ట్‌గా ప్రోత్సహించినట్టే లెక్క.

మనం నెలకు రెండు సినిమాలకంటే వెళ్ళకూడదు. నడవాలి, రిక్షాలు, టాక్సీలు ఎక్కకూడదు. (ఆరోగ్యం కోసం కాదు – డబ్బు ఖర్చు). రోజుకి 20 సిగరెట్లకంటె ఎక్కువ కాల్చకూడదు. నాలుగుమాట్లే కాఫీలు తాగాలి. హోటళ్లకు వెళ్లకూడదు సొంత డబ్బుతో – అని సొంత సీలింగులు పెట్టుకుంటున్నాం. అన్నీ ఆచరిస్తున్నామా – లేదు. ఎంచేత? సీలింగు దారి సీలింగుదే – మనసు చెప్పినట్టు చేస్తాం. కనక విడాకులు అఫీషియల్‌గా పుచ్చుగున్నా అనఫీషియల్‌గా సంసారాలు సాగించేస్తారు. అయితే మళ్ళీ ఇందులో స్వంత భర్తతో సహజ భార్య కలుస్తున్నా లాడ్జింగు హవుసులపై దాడి జరిపినట్లు పోలీసులు సీలింగ్ దంపతులపై దాడిచేసి "భర్తతో" "వ్యభిశారం" సేస్తున్నారని పట్టుకుంటే టుబిఆర్ నాట్ టుబి అని గిరీశం పడ్డ అవస్థలో పడతారు. ఆస్తికోసం విడాకులడుగుతున్నారు. కాని విడాకులుచ్చుకున్నాక పిల్లలు పుడితే 'క్రీస్తుముందు

క్రీస్తువెనుక' అన్నట్లు చెప్పు కోవాలేమో! - మరియు - అమ్మీ నీకు తెలియదుగాని మన హిందూ రిలిజన్ చాలా ఫ్లెక్సిబుల్ - మడతమంచంలాగా వాలుకుర్చీలాగా అప్పడాల పిండి లాగా సాగుతుంది. ఇది ధర్మ విహితమే - అయితే కొంచెం రాక్షస నీతి ప్రకారం అని చచ్చినట్లు ఒప్పుకోక తప్పదు.

విడాకులిచ్చిన స్త్రీలు పునర్వివాహాలు చేసుకోవచ్చు కదా - ఆస్తి కోసం స్త్రీలకు విడాకులిస్తే "వుమన్స్ లిబ్" అవసరం లేకుండా ఆర్థిక స్వాంత్ర్యంతోపాటు సెక్సు స్వాతంత్ర్యం కూడా యిచ్చినట్లవుతుంది కదా!

కుంచం తిరగేస్తే నాలుగు గింజలేనా మిగుల్తాయన్నట్లు ఈ విధంగా కోర్టులద్వారా స్త్రీకి హెచ్చు అధికారాలూ ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తే సంతోషించాలి మరి. భర్తలంటారా "మెన్‌మేకం అండ్ మెన్ మే గో" అంటారు విడాకుల డాకూలు.

విడాకులిచ్చిన సంపన్న గృహిణులు మళ్ళీ మిస్‌లవుతారు కాబట్టి దమయంతికి ద్వితీయ స్వయంవరం చాటించినట్లు ఆస్తులకోసం కాపురాలు కూలద్రోసుకుంటున్న ఈ ఆధునిక ఆస్తి (క) దమయంతులకు ద్వితీయ స్వయంవరాలు కూడా ఏర్పాటుచేస్తే ఎవరూ ఆశ్చర్యపోనవసరంలేదు.

అంతా మన పురాణాల్లో హిందూ రిలిజిన్‌లో వున్నదే గదండీ.

# పాడిందే పాట

మనిషి తానుగా ఏదీ నిర్ణయించుకొందుకు సమర్థుడుకాడు. అతనికా అవకాశం లేదు. మనిషి స్వతంత్రుడు కాడు. అతని జీవితం సంపూర్ణం కాదు, అతని ఆలోచనలు, అతని నిర్ణయాలు అతనివి కావు. తానుగా ఏదీ నిర్ణయించుకుందుకు అవకాశం యివ్వకుండా తాము చెప్పినట్లు సామాన్యుడ్ని లొంగదీసుకొనటం కోసం పబ్లిసిటీ బాగా వుపయోగపడుతుంది. ఈ పబ్లిసిటీని నమ్ముకుని చెత్త సినిమాలు చూడటం, చెత్త పుస్తకాలు చదవటం, పనికిరాని వస్తువుల్ని కొనటం, పోరంబోకు సంస్థల్నీ మనుషుల్నీ నమ్మటం లాటిది సామాన్యుడు చేస్తున్నాడు. ఒక విషయాన్ని పదే పదే చెప్పటం వలన నిజం కామోసు అనే భ్రాంతి కలుగుతుంది. నిజం అయినా కాకపోయినా పాడిందే పాటగా పాడుతుంటే జనం నమ్మేస్తారు, జనాన్ని మోసం చేయాలంటే ముందు వారిని నమ్మించాలి. నమ్మని వారిని మోసగించటం సులభంకాదు. భారీఎత్తున పబ్లిసిటీ జరిగే ప్రతి విషయంలో భారీ ఎత్తున మోసం జరిగే అవకాశం వున్నట్లే లెక్క. రాజకీయాలలో దగాకోరుతనం వుంది. వాణిజ్యంలో సరేసరి. అది ఎప్పుడూ వుండనే వుంటుంది తోడు పెళ్ళికూతుర్లా. జీవితంలో కూడా వుంది. కళల్లోకి ఎప్పుడో ప్రాకింది.